క్లుప్తంగా

నైతిక విలువలతో కూడిన విద్య అవసరం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అవసరమని టూ టౌన్ సీఐ రెడ్డప్ప, ఎంఈఓ గోపాల్‌నాయక్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు పేర్కొన్నారు. పదో తరగతిలో కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత(68 మంది) సాధించిన సందర్భంగా శుక్రవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు.అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విష్ణు(595), లిఖిత(590), హాసిని(584), సహన(583), కుసుమ(575)కు నగదు బహుమతులు అందజేశారు. కాకతీయ విద్యానికేతన్ పాఠశాల వ్యవస్థాపకులు మేడాపురం రామిరెడ్డి, చెన్నకృష్ణమ్మ, కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ ఉపాధ్యాయినులు, నాన్ టీచింగ్ సిబ్బందికి పట్టుచీరలను అందించారు.

పాడి రైతుకు ఆర్థిక సాయం



రైతు సుధాకర్‌కు నగదు అందిస్తున్న కన్వీనర్ రవికుమార్‌రెడ్డి

నల్లచెరువు: కె.పూలకుంట గ్రామంలో రైతు సుధాకర్‌కు చెందిన పాడి ఆవు గత నెలలో పిడుగుపాటుకు గురై మృతి చెందింది. అప్పట్లో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ రైతుకు ఆర్థికసాయం అందజేస్తానని ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రూ.10 వేలు పంపగా పార్టీ మండల కన్వీనర్ తాను రూ.5 కలిపి మొత్తం రూ.15 వేలను శుక్రవారం బాధిత రైతుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అక్బర్, గోవిందరెడ్డి, ముల్లా భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి. నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, సలీం, హయాత్‌ఖాన్, హిదయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు వెలకట్టలేనివి



ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: పోలీసుల సేవలు వెలకట్టలేనివని ఎస్పీ రత్న పేర్కొన్నారు. గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్ఐ వెంకటసుబ్బయ్య, హెడ్‌కానిస్టేబుల్ రామలింగయ్యకు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ సేవలను కొనియాడారు. అనంతరం వారికి శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఏఓ సుజాత, సూపరింటెండెంట్ మల్లికార్జున, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఆర్‌లు వలి, మహేష్, ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన బస్సు

- వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఈశ్వర్ బాబు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని యర్రంపల్లి–నాగసముద్రం గేట్ గ్రామాల మధ్య 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. అనంతపురం నగరం తపోవనం కాలనీకి చెందిన ఈశ్వర్ బాబు అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఫ్లై ఉడ్, అద్దాలను బాడుగకు మాట్లాడుకుని హిందూపురం బయలుదేరాడు. ఆటో యర్రంపల్లి–నాగసముద్రం గేట్ గ్రామాల మధ్యకు చేరుకోగానే.. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఆటోను వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడటంతో ధ్వంసమైంది. బస్సు డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడు. ఈశ్వర్ బాబుకు ఎడమ కాలు విరిగింది. తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడ్ని హుటాహుటిన చెన్నేకొత్తపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

నిప్పుల కొలిమి!





ఎండతో నిర్మానుష్యంగా చీకిరేవులపల్లి ప్రధాన వీధి



గంగిరెడ్డిపల్లి వద్ద ఈత కొడుతున్న పిల్లలు

- రోజురోజుకూ పెరిగిపోతున్న ఎండలు
- ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్న ప్రజలు
- వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

అమడగూరు: ఎండలే ఎండలు.. ఉదయం తొమ్మిది దాటితే ఇంట్లో ఉక్కపోత.. బయటకు వెళ్తే నడినెత్తిన మంట.. అత్యవసర పనుల మీద బయటకు వెళ్లినా వడదెబ్బకు భయపడిపోయే పరిస్థితి. రోజురోజుకూ ఎక్కువై పోతున్న ఎండలు, ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండలు కొలిమిని తలపిస్తున్నాయి. దీంతో వేడిమిని భరించలేక చాలామంది ప్రజలు చెట్లు, గోడల కింద, ఆలయాల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. వేడిగాలుల తీవ్రత కూడా ఎక్కువ కావడంతో సాయంత్రం నాలుగు గంటల వరకూ జనం ఇంట్లోనే ఉండిపోతున్నారు.

ఉపాధి కూలీలకు తప్పని అవస్థలు..

మండలంలో సుమారు రెండు వేలమంది కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. అయితే ఇటీవల ఎండ తీవ్రత పెరగడంతో సగం మంది పనులను మానేసినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోనూ సుమారు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎక్కడ నీరు కనపడినా చిన్నా, పెద్దా తేడా లేకుండా నీటిలో మునుగుతూ వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులంతా 12 గంటల నుంచి బావులు, చెరువులు, కుంటల్లో ఈత కొడుతూ ఎంజాయ్ చేస్తున్నారు.

ఎండను భరించలేక పోతున్నాం



గతంలో ఎన్నడూ ఇంత ఎండ చూడలేదు. తీవ్రమైన ఎండకు పనుల చేస్తుంటే చాలామంది రోగాల బారిన పడుతుండటంతో ఉపాధి పనులకు వెళ్లేవారు సగంమంది పనులను మానేశారు. ఉపాధి పనులకు సరిగా బిల్లులు ఇవ్వక, చేసిన పనులకు తగినంత కూలీ చిక్కక పోతుండటంతో కూలీల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఇలాంటి ఎండలు కాస్తే బయటకెళ్లి ఎలా పనులు చేసుకోవాలి?

–మునివెంకట, ఉపాధి కూలీ, అమడగూరు

వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి



వేసవిలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా నల్లని దుస్తులు ధరించరాదు. 11 గంటలు దాటిన తర్వాత ఎండలో పనులకు చేయరాదు. ఎక్కువగా ద్రవపదార్థాలు సేవించాలి, త్వరగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి, వడదెబ్బ లక్షణాలు అనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి తీసుకెళ్లి చల్లని నీటితో శరీరాన్ని తుడవాలి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. తర్వాత దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలి. చిన్నపిల్లలు, వద్దులకు ఎక్కువగా వడదెబ్బ సోకే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



అకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి టౌన్: కదిరి సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శివనారాయణస్వామి హెచ్చరించారు. గురువారం అర్ధరాత్రి డీఎస్పీ ఆధ్వర్యంలో టౌన్ సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్జాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా డిగ్రీ కాలేజీ గ్రౌండ్ , జూనియర్ కాలేజీగ్రౌండ్, నానా దర్గా వెనుక వైపు, సున్నపుగుట్టతాండా వాటర్ ట్యాంక్, ఆర్అండ్‌బీ బంగ్లా, కౌలేపల్లి రైల్వేగేట్, కంచుకోట, జౌకుపాళ్యం, ఏటిగడ్డ, కందికుంట నారాయణమ్మ కాలనీ, బాబా కాలనీ, నిజాంవలీ కాలనీ, బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పట్టుబడిన ఆకతాయిలకు డీఎస్పీ కౌన్సెలింగ్ ఇచ్చారు. వ్యసనాలు, చెడు సావాసాలకు దూరంగా ఉండాలన్నారు. గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్లర్లకు పాల్పడే వారిపై రౌడీషీట్ తెరుస్తామన్నారు.

కేతిరెడ్డి కాలనీలో కార్డెన్ సెర్చ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లతోపాటు రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం కాలనీవాసులకు టూ టౌన్ సీఐ రెడ్డప్ప సైబర్‌క్రైమ్, బాల్యవివాహాల నిర్మూలన, శక్తియాప్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి

తనకల్లు: రైతుల, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు సాంకేతికతను అలవర్చుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని చైతన్య ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీలోని రైతులు, ఎఫ్‌పీఓ బోర్డు సభ్యులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సన్న, చిన్న కారు రైతులకు డిజిటల్ గ్రీన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. కొత్తగా ప్రవేశపెట్టిన సాంకేతిక సదుపాయం (ఫీచర్) ద్వారా ఎఫ్‌పీఓలు (ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ) తమ ఉత్పత్తులు, సేవలను ఫార్మర్ చాట్ ఇంటర్‌ఫేస్‌లో నేరుగా ప్రదర్శించవచ్చని తెలిపారు. దీని ద్వారా రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, మందులతో పాటు ఇతర సేవలను ఎఫ్‌పీఓల నుండి పొందవచ్చన్నారు. సాంకేతికతను ఉపయోగించుకొని రైతులు సమగ్రాభివృద్ధిని సాధించి, సాధికారత దిశగా సాగాలని గ్రీన్ సంస్థ వైస్ ప్రెసిడెంట్, టెక్ లీడ్ ఎండీ రజాక్ చెప్పారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి లావణ్య, వీహెచ్‌ఏలు, సెర్ప్, రెడ్, బీటీడీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్

జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

పుట్టపర్తి టౌన్: ఈనెల 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభల్లో విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్ కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా 20 లక్షల ఉద్యోగాలిస్తామని, లేనిపక్షంలో యువతకు నెలకు రూ.నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. దాదాపు 11 నెలలు గడిచినా ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదని, పైసా భృతి కూడా చెల్లించలేదని విమర్శించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేసి పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వయో పరిమితిని పెంచి ప్రిపరేషన్‌కు 90 రోజుల గడువు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సకలరాజా,జిల్లా అధ్యక్షులు శేషం మహేంద్ర, రాష్ట్ర సమితి సభ్యులు దేవేంద్ర, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కమల్‌బాషా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

12 మంది 'బెస్ట్' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

పుట్టపర్తి టౌన్: బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలోని అగ్రికల్చర్ సైన్స్, అప్లైడ్ కళాశాలకు 12 విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు కళాశాల డీన్ డాక్టర్ రాజగోపాల్ శుక్రవారం తెలిపారు. ప్రముఖ పెస్ట్ కంట్రోల్ కంపెనీ రెంటోకిల్‌లో 10 మంది, న్యూట్రిఫ్రెష్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ఇద్దరికి ఉద్యోగాలు దక్కాయన్నారు. వీరికి ఏడాదికి రూ.3 లక్షల ప్యాకేజీ అందుతాయని తెలిపారు. అక్షయకల్ప ఆర్గానిక్ కంపెనీలో 100 విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి నెలకురూ.10 వేల గౌరవ వేతనం, రూ.6 వేలు అలవెన్స్ ఇస్తారని తెలిపారు. బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ విద్యార్థులను విద్యపరమైన విషయాలతో వ్యవసాయ రంగంలో ఆచరణాత్మక అనుభవం గడించేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.

కాశి నాయన ఆశ్రమానికి విరాళం



ఆశ్రమ నిర్వాహకులకు నగదు అందిస్తున్న కౌన్సిలర్ కోటిరెడ్డి బాలిరెడ్డి

ధర్మవరం రూరల్: గరుడంపల్లి వద్ద నిర్మించిన కాశినాయన ఆశ్రమానికి శుక్రవారం ధర్మవరం 29వ వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, కోటిరెడ్డి బాలిరెడ్డి దంపతులు రూ.28,500 విరాళాన్ని అందజేశారు. కోటిరెడ్డి గంగిరెడ్డి, కోటిరెడ్డి శాంతమ్మల జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. ఆశ్రమ అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యక్షులు శంకర చౌడప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడదాం

పుట్టపర్తి/ ఓడీచెరువు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేద్దామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఇటీవల కొత్తగా నియమితులపైన నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు నాగమల్లేశ్వరరెడ్డి, యువజన విభాగం వాణిజ్య విభాగం చెరువు జనార్దన్‌రెడ్డి, సోషల్ మీడియా విభాగం ఇర్ఫాన్ మాజీ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశా ధన్యవాదాలు తెలియజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశ్వర్థరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, బోర్‌వెల్ హనుమంతరెడ్డి, కొక్కంటిపల్లి కృష్ణారెడ్డి, రత్నశేఖర్ రెడ్డి, వై.హనుమంతరెడ్డి ,అల్లాపల్లి సర్పంచ్ వెంకటరమణ, రాజా, సుధాకర్, మోహన్‌నాయక్, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లి చెందిన గూడూరు నాగేంద్ర అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శుక్రవారం బాధితుడి ఇంటికి చేరుకుని పరామర్శించారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బ్రాహ్మణపల్లికి చెందిన రమేష్ అమ్మ పెద్దక్క, నల్లమాడ మండలం చెరువువాండ్లపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డిని పరామర్శించి వారి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. జెండా వేపమాను ప్రాంతానికి చెందిన ఖదార్‌బాషా(54) మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే ఖాదర్‌బాషా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రవినాయక్, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, నల్లమాడ మండల కన్వీనర్ ఆదినారాయణ, జిల్లా అధికారి ప్రతినిధి ఫొటో సాయి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్లు మాధవరెడ్డి, గంగాద్రి, నాయకులు సత్యనారాయణ, సందీప్‌నాయుడు, రామచంద్ర, తిరుపాలప్ప, వెంకటరాముడు, సూరి, వెంకటేష్, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిసిన జనార్దన్‌రెడ్డి, నాయకులు



కమ్మవారిపల్లిలో నాగేంద్రను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం

మహిళపై దాడి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని జోగోనికుంటలో మామిడికాయలు అమ్మే విషయంలో శుక్రవారం వెంకట నాగిని అనే మహిళను లక్ష్మీనారాయణ, ఆలియా, చిట్టి, కవిత, కాటమయ్య, శంకర్, గంగమ్మ దుర్భాషలాడుతూ దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

దివ్యాంగుడి అదృశ్యం

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం లింగప్పగారిపల్లికి చెందిన ఓ దివ్యాంగుడు అదృశ్యమయ్యాడు. రెండు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. బాధితుడి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తనకల్లు: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో బాబ్‌జాన్ అనే వ్యక్తి శుక్రవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించారు. వివరాలు... కొక్కంటి చెందిన బాబ్‌జాన్ భార్య కొద్దిరోజుల నుంచి మనస్పర్థలతో వేరుగా ఉంటోంది. కాపురానికి రావాలని పిలిచినా రాకపోవడంతో మనస్తాపం చెంది విషద్రావకం తాగాడు. గమనించిన పోలీసులు అతడిని తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హాకీ స్టిక్కుల పంపిణీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణకు వచ్చిన క్రీడాకారులకు హాకీ స్టిక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ వేసవి శిక్షణ సందర్భంగా క్రీడాకారులందరికీ హాకీ శిక్షణ ఇస్తున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హాకీ వైస్ ప్రెసిడెంట్ గౌరీప్రసాద్, ట్రెజరర్ అంజన్న, సత్యసాయి జిల్లా స్పోర్ట్స్ అథారిటి హాకీ కోచ్ హస్సేన్, సభ్యులు అరవింద్, చంద్రశేఖర్, మారుతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుట్టపర్తి అర్బన్: వీరాంజనేయపల్లి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. చెర్లోపల్లికి చెందిన ప్రభాకర్, లక్ష్మీపతి శుక్రవారం సాయంత్రం పుట్టపర్తిలో పని ముగించుకుని స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరారు. వీరాంజనేయపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి బైక్ దూసుకెళ్లింది. ఘటనలో లక్ష్మీపతి నాలుక తెగింది. వెంటనే అతడిని బెంగళూరు మిలట్రీ ఆసుపత్రికి తరలించారు. ప్రభాకర్‌కు తీవ్రగాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

తనకల్లు: స్థానిక పెట్రోల్ బంకు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు... బత్తినవారిపల్లికి చెందిన నగేష్, మౌనిక, రెడ్డిప్రసన్న తవళం ఆంజనేయస్వామిని దర్శించుకుని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. అయితే పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఐచర్ వాహనం బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో ముగ్గురికీ బలమైన గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను కదిరి ఆసుపత్రికి తరలించారు.

కుల గణన హర్షణీయం

కదిరి టౌన్: కుల గణనకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించం హర్షణీయమని బీసీ ఉద్యోగులు సంఘం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడారు. కుల గణన ద్వారా బీసీలకు న్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. మహాత్మా జ్యోతీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజును బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.

ఆర్టీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయాలి

ధర్మవరం: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో శుక్రవారం సీపీఐ, సీపీఎం, జనసేన, సీపీఐ ఎంఎల్, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ, డీహెచ్‌పీఎస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయకపోవడంతో సంస్థ సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. వెంటనే కేంద్రం ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయాలని కోరారు. ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్ సుధాకర్, సీపీఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జింకా చలపతి, జనసేన పట్టణ అధ్యక్షుడు శ్యామ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కేశగాళ్ల వెంకటేష్, రైతు సంఘం నేత కాటమయ్య, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, రామకృష్ణ, వెంకటస్వామి, బండల వెంకటేష్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

ధర్మవరం అర్బన్ : గూడ్స్‌షెడ్‌కొట్టాలలో ఓ ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు..హిందూపురం మండలం చలివెందుల గ్రామానికి చెందిన అంకే నరసింహమూర్తి, మహేశ్వరి కుమార్తె జోష్న(19) అనంతపురంలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. గూడ్స్‌షెడ్‌కొట్టాలలోని పెద్దమ్మ గంగాదేవి ఇంటికి మూడురోజుల క్రితం ఇంటికి వచ్చింది. గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాకపోవడంతో విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనం



నిడిగల్లు గ్రామంలో కిశోర బాలికల సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లలితమ్మ

తాడిమర్రి: బాల్య వివాహాలతో చిన్నారుల భవిష్యత్తు నాశనమవుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రమ్మ, లలితమ్మ పేర్కొన్నారు. పెద్దకోట్ల, నిడిగల్లు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం కిశోర బాలికల సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిశోర బాలికల కోసం జూన్ 10 వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహించే క్యాంపుకు కిశోర బాలికలందరూ హాజరు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే సమాజంలో ఎదురయ్యే సామాజిక, లైంగిక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని వారు బాలికలకు సూచించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలోని రామస్వామి ఆలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీడీపీఓ రాధిక మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 18 ఏళ్లలోపున్న బాలికలను గుర్తించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: బాలికలు బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ అన్నారు. కోటపల్లి, దండువారిపల్లి, టీ. సదుం, మల్లిరెడ్డిపల్లిలో శుక్రవారం కిశోర వికాసం– వేసవి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాలను అరికట్టడం, కిశోరి వికాసం కమిటీలు, ఆరోగ్యం– పౌష్టికాహారం, లింగ వివక్షత నిర్మూలన, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధి అవకాశాలు, ఆత్మరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా కార్యదర్శులు ఫాతీమా, రిహానా, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కనగానపల్లి: యుక్త వయస్సు బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. మండలంలోని ముక్తాపురం గ్రామంలో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆరోగ్య సిబ్బందితో కలసి కిశోర బాలికలకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లక్ష్మి, మామిళ్లపల్లి, ముక్తాపురం, పర్వతదేవరపల్లి గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.